
పరీక్ష కేంద్రం వివరాలు పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్


కొత్తగూడెం పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

# పది పరీక్షలు ప్రారంభం

**మొదటి రోజు ఖమ్మంలో 99.76 శాతం, భద్రాద్రిలో 99.42 శాతం హాజరు**

- ఖమ్మం జిల్లాలో 51 మంది, కొత్తగూడెంలో 71 మంది విద్యార్థుల గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు, డీఈవోలు, ఉమ్మడి జిల్లా అబ్జర్వర్
- విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఏదులాపురంలో ఇన్విజిలేటర్ తొలగింపు


ఖమ్మంలోని ఎన్ఎస్పీ క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఖమ్మంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 18: పదో తరగతి వార్షిక పరీక్షలు ఖమ్మం జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభం కానుండగా విద్యార్థులు సుమారు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలి వార్షిక పరీక్ష కావడంతో విద్యార్థులు తమకు ఇష్ట దైవాలకు పూజలు చేయడంతో పాటు తమ హాల్ టికెట్లకు సైతం ప్రత్యేక పూజలు చేయించుకొని పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 97 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు తెలుగు పరీక్షకు మొత్తం 16,582 మంది విద్యార్థులకుగాను 16,543 మంది హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99.76 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ప్రైవేట్‌లో 58 మంది విద్యార్థులకు గాను 46 మంది హాజరై 12 మంది గైర్హాజరయ్యారు.

### కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, అబ్జర్వర్, డీఈవో

ఖమ్మం నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్ష తీరును, సౌకర్యాలను గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేడీ సర్వీసెస్, రెండు జిల్లాల అబ్జర్వర్ పీ.మదన్‌మోహన్, డీఈవో సోమశేఖరశర్మ కూడా పలు కేంద్రాలను తనిఖీ చేశారు. జేడీ సర్వీసెస్ మదన్‌మోహన్ జిల్లా మారుమూల ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. తొలుత సీఎస్, డీవోలతో సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. తొలి పరీక్ష కావడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్దకు చేరుకుని పరీక్ష కేంద్రంలోకి వెళ్లే వరకు, తిరిగి బయటకు వచ్చే వరకూ అక్కడే వేచి ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. జిల్లా అబ్జర్వర్ ఐదు కేంద్రాలను, డీఈవో 10 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బాధ్యులు 40 కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా, ఏదులాపురం కేంద్రంలో తనిఖీ చేస్తున్న సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళా ఇన్విజిలేటర్ తన తరగతి గది ఎదుటనే తన కారును పార్కు చేసి ఉంచడాన్ని డీఈవో గమనించారు. దీనిని తీవ్రంగా పరిగణించి ఆమెను విధుల్లోంచి తొలగించారు



### భద్రాద్రి జిల్లాలో 12,344 మంది హాజరు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రెగ్యులర్ విద్యార్థుల కోసం 70, ప్రైవేట్ విద్యార్థుల కోసం 3 కేంద్రాలను కలిపి మొత్తం 73 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థులు 12,341 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా 12,286 మంది హాజరయ్యారు. 55 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 74 మందికి గాను 58 మంది హాజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 12,344 మంది హాజరై 71 మంది గైర్హాజరయ్యారు. 99.42 శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాలను డీఈవో వెంకటేశ్వరచారి సందర్శించారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పరీక్ష సమయం కంటే గంట ముందుగానే విద్యార్థులు చేరుకోవడంతో సిబ్బంది వారిని పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. కలెక్టర్ ప్రియాంక రెండు కేంద్రాలను, జిల్లా పరిశీలకుడు మదన్‌మోహన్ ఒక కేంద్రాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్ 28 కేంద్రాలను పరిశీలించారు.

### పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండాలి: భద్రాద్రి కలెక్టర్

టెన్త్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లూ జరగకూడదని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆదేశించారు. టెన్త్ పరీక్షల ప్రారంభం సందర్భంగా కొత్తగూడెంలోని సింగరేణి హైస్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూళ్ల పరీక్షా కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతులు, విద్యార్థుల గురించి చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష సరళిని పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లి : పరీక్షా కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థులు


కొత్తగూడెం ఎడ్యుకేషన్ : తన వాహనంలో ఓ విద్యార్థిని కేంద్రానికి తీసుకొచ్చిన ఎస్సై


వైరాటౌన్ : పరీక్ష రాస్తున్న విద్యార్థులు


ఖమ్మంలో ఆల్ ది బెస్ట్ చెప్పుకుంటున్న విద్యార్థినులు


అన్నపురెడ్డిపల్లి : విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది


అశ్వారావుపేట టౌన్ : హాల్‌టికెట్ చూపిస్తున్న విద్యార్థులు


కొత్తగూడెం ఎడ్యుకేషన్ : విద్యార్థులను పరిశీలించి కేంద్రంలోకి అనుమతిస్తున్న పోలీస్ సిబ్బంది


ఇల్లెందు రూరల్ : విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు


పాల్వంచ రూరల్ : కిన్నెరసానిలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

# నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు

**50 ఎకరాల్లో వరి పంటను వదిలివేసిన రైతులు**

**ఇల్లెందు మండలంలో దుస్థితి.. సర్కార్ న్యాయం చేయాలని డిమాండ్**


పంటలను చూపిస్తున్న రైతులు


విత్తనాల బస్తా సంచులతో అన్నదాతలు

ఇల్లెందు రూరల్, మార్చి 18: రెక్కలు ముక్కలు చేసుకుని.. అప్పో సప్పో చేసి వరి సాగు చేస్తున్నామని, తీరా సాగు ప్రారంభించాక పైరు ఎదగడం లేదని, డీలర్లు నకిలీ విత్తనాలు అంటగంటడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని మండలానికి చెందిన పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మీడియాకు వివరాలు వెల్లడించారు. కొమరారం, బోయితండా, పోచారం, పోలారంతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు సుమారు 50 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మొదట్లో పైరు బాగానే ఉన్నప్పటికీ రెండు నెలల తర్వాత ప్రాథమిక దశలోనే పక్వానికి రావడం, ఎదుగుదల లేకపోవడం, కాండాలు దృఢం కాకపోవడాన్ని గమనించారు. డీలర్లు ఇచ్చిన నకిలీ విత్తనాలతోనే ఈ పరిస్థితి వచ్చిందని నిర్ధారించుకుని సోమవారం మూకుమ్మడిగా మీడియాకు గోడు వెల్లబోసుకున్నారు. ఒక్కో ఎకరానికి సుమారు రూ.30 వేల చొప్పున అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం పంట చేతికొచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నకిలీ విత్తనాలు అంటగట్టిన డీలర్లపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అలాగే తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై 'నమస్తే' ఏవో సతీష్‌ను వివరణ కోరగా.. 'డీలర్లు నకిలీ విత్తనాలు అంటగట్టారని రైతులు మాకు ఫిర్యాదు చేశారు. ఆయా దుకాణాల యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. రైతుల నుంచి విత్తనాలు సేకరించి వాటిని ల్యాబ్‌కు పంపించాం. విత్తనాలు నకిలీవి అని తేలితే డీలర్లపై చర్యలు తీసుకుంటాం..' అని సమాధానమిచ్చారు.

# ఎంపీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

- జిల్లాలో 1,095 పోలింగ్ స్టేషన్లు
- మొత్తం ఓటర్లు 9,84,629 మంది
- ఐదు నియోజకవర్గాలకు ఏఆర్వోల నియామకం
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్ రాజ్


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక. పక్కన ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : ఎంపీ ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లావ్యాప్తంగా 1,095 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. సోమవారం ఐడీవోసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్‌తోపాటు ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు అనుసంధానంగా ఉన్న ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల ఆర్వోలు అక్కడే ఉంటారని, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఏఆర్వోలు ఉంటారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని, ఇప్పటివరకు రూపొందించిన జాబితాలో 9,84,629 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో మహిళలు 5,06,471 మంది ఉండగా.. పురుషులు 4,78,098 మంది ఉన్నారని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు 60 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఐదు నియోజకవర్గాల్లో ఏఆర్వోలను నియమించామని, పినపాకకు ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఇల్లెందుకు జే.కాసయ్య(ఎస్డీసీ), అశ్వారావుపేటకు డి.వేణుగోపాల్(అదనపు కలెక్టర్), భద్రాచలంకు ఆర్డీవో దామోదర్, కొత్తగూడెంకు ఆర్డీవో డి.మధులను నియమించినట్లు తెలిపారు.

### ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే.. : ఎస్పీ రోహిత్ రాజు

ఎన్నికల కోడ్‌ను పటిష్ఠంగా అమలుపరిచేందుకు అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టులను 12 ఏర్పాటు చేశామన్నారు. ఒక వ్యక్తి వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తామని, ఎలాంటి ఆధారాలు లేని నగదు రూ.10 లక్షలు ఉన్నా వాటిని కూడా సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో నిరంతరం పోలీసుల తనిఖీలు ఉంటాయని, దీనికి ప్రజలు సహకరించాలన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. విలేకరుల సమావేశంలో పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదుట విద్యార్థినుల ధర్నా

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 18: కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు తమను వేధిస్తున్నారని, అర్ధరాత్రి వసతి గృహాలకు వెళ్లి అసభ్యకరంగా మాట్లాడుతున్నారని సోమవారం సుమారు 300 మంది మెడికల్ విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో సరైన తాగునీటి వసతి లేదని, బయట నుంచి ఎక్కువ ధరకు ప్యూరిఫైడ్ నీరు తెచ్చుకుని తాగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుడ్ మెనూ అమలులో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం హాస్టల్ పాల్వంచలోని ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతుందని, వైద్యకళాశాలలో నిర్మిస్తున్న హాస్టల్ ఇప్పటికీ పునాదుల దశలోనే ఉందన్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

# చెక్‌పోస్టుల వద్ద అలర్ట్‌గా ఉండాలి

**ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్**


ఐడీవోసీలో కార్యాలయాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఈ సందర్భంగా నగరంలోని కాల్వొడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్టీ చెక్‌పోస్టును సోమవారం కలెక్టర్ తనిఖీ చేసి మాట్లాడారు. విస్తృత తనిఖీలు చేపట్టి నగదు, మద్యం రవాణాను నియంత్రించాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పంపించాలన్నారు. ప్రతి చెక్‌పోస్టులో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి, అధికారులు పాల్గొన్నారు.

### ఎన్నికల నియమావళి పాటించాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారులు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అన్ని శాఖల కార్యాలయాలను సందర్శించిన ఆయన రాజకీయ నేతలు, పార్టీలకు సంబంధించి క్యాలెండర్లు, పోస్టర్లు, ఫొటోలను తొలగించారా.. లేదా.. అని పరిశీలించారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కలెక్టర్ వెంట శిక్షణా సహాయ కలెక్టర్ యువరాజ్, ఇంచార్జ్ డీఆర్వో ఎం.రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలు ప్రారంభం

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలను కలెక్టర్ గౌతమ్ కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, సీపీవో శ్రీనివాస్, ఖమ్మం ఎంవీఐ వెంకటరమణ, అదనపు పౌరసంబంధాల అధికారి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పకడ్బందీగా నవమి ఏర్పాట్లు : కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : భద్రాచలంలో శ్రీరామనవమి ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని, నవమి వేడుకలు, మహా పట్టాభిషేకం మహోత్సవాలను వీక్షించే భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో శ్రీరామనవమి, మహా పట్టాభిషేక కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కల్యాణ మండపం ప్రాంతాన్ని 26 సెక్టార్లుగా విభజించి, పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. భక్తుల వసతి(లాడ్జి)ని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం కల్పించామని, టికెట్ల విక్రయాలు కూడా ఆన్‌లైన్‌లో చేపట్టాలని, విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. సెక్టార్లలో ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించాలని డీపీవోకు సూచించారు. పట్టణంలో పారిశుధ్య పర్యవేక్షణకు 25 జోన్లుగా విభజించి.. ప్రతి జోన్‌కు ఒక ఎంపీవో, నలుగురు కార్యదర్శులను నియమించినట్లు పేర్కొన్నారు. మంచినీటి సరఫరాకు 200 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో రమాదేవి, డీఆర్వో రవీంద్రనాథ్, ఆర్డీవో మధు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.